# వెచ్చని స్నేహితులు



- చలి పులిని దూరం చేసే ఉన్ని దుస్తులు
- ఫుట్‌పాత్‌లపై విరివిగా విక్రయాలు
- రూ.100 నుంచి రూ.1000 ధరల్లో
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

ప్రస్తుతం చలి పెరిగింది. సాయంత్రం ఐదు గంటల నుంచే చలి గాలి వీస్తోంది. రాత్రి పది గంటలకే మంచు కురుస్తోంది. ఉదయం 9 గంటల వరకు పొగమంచు పడుతూనే ఉంది. రాత్రిళ్లు చలి తీవ్రత పెరిగింది. ప్రజలు చలి నుంచి రక్షించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా ఉన్ని దుస్తులు ధరించేందుకు మొగ్గు చూపుతున్నారు. స్వెట్టర్లు, మఫ్లర్లు, మంకీ క్యాప్‌లు, స్కార్ఫ్‌లు, చేతులకు గ్లౌజ్‌లు వాడుతున్నారు. రాత్రిళ్లు ఉన్నితో చేసిన రగ్గులు, దుప్పట్లు, శాలువాల విక్రయాలు కూడా జోరందుకున్నాయి.

చిల్లకూరు : చలికాలంలో ఎక్కువ మంది వ్యాధుల బారిన పడుతుంటారు. ముఖ్యంగా నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో చలి ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహనదారులు, సైక్లిస్టులు ఎక్కువగా గొంతు, ముక్కు, ఉదర సంబంధిత వ్యాధులతో బాధపడుతుంటారు. చలికి శరీరం బాగా బిగుసుకుపోయినట్లు అవతుంది. ఆస్తమా, క్షయ వ్యాధిగ్రస్తుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. చిన్న పిల్లలు, వృద్ధులు కూడా చలి బారిన పడి ఇబ్బందులు పడతారు. ఈ క్రమంలో వెచ్చదనాన్ని ఇచ్చే దుస్తులు ధరించి రక్షణ పొందాల్సిన పరిస్థితి. ఉన్ని దుస్తులు చలిని తట్టుకుని వెచ్చదనాన్ని ఇస్తాయి. దీంతో ఎక్కువ మంది ఈ దుస్తులను కొనుగోలు చేస్తారు.

**గూడూరులో సగటు చలి తీవ్రత**

| రోజు | పగలు గరిష్టం (డిగ్రీల సెల్సియస్) | రాత్రి కనిష్టం |
|---|---|---|
| ఆదివారం | 26.32 | 20.03 |
| సోమవారం | 27.02 | 21.03 |
| మంగళవారం | 20.25 | 18.70 |
| బుధవారం | 20.02 | 17.7 |
| గురువారం | 21.45 | 18.3 |
| శుక్రవారం | 23.06 | 17.3 |



### ఫుట్‌పాత్‌లపై విరివిగా ఉన్ని దుస్తుల విక్రయాలు

గతంలో ఉన్ని దుస్తులు ఎంపిక చేసిన దుకాణాల్లో మాత్రమే లభించేవి. ఉన్ని దుస్తుల వినియోగం ఎక్కువ కావడంతో నేడు ప్లాట్ ఫాంలపై విక్రయాలు ఊపందుకున్నాయి. కొంతమంది సైకిళ్లు, బైక్‌లపై గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి విక్రయిస్తున్నారు. ధరలు కూడా అందరికీ అందుబాటులో ఉంటున్నాయి. మహిళలు, చిన్నారులకు సంబంధించిన ఉన్ని దుస్తులు రూ.200 నుంచి రూ.1000లు, యువత, పెద్దలకు సంబంధించినవైతే రూ.300 నుంచి రూ.800లకు విక్రయిస్తున్నారు. మఫ్లర్లు, మంకీ క్యాప్‌లు, స్కార్ఫ్‌లు రూ.50 నుంచి రూ.100 లోపు దొరుకుతున్నాయి. వీటిలో చలికి, వర్షానికి వాడుకునే విధంగా ఉండడంతో ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

### ఉన్ని దుస్తుల వాడకం తప్పనిసరి



శ్వాస సంబంధిత వ్యాధిగ్రస్తులు చలికాలం వచ్చిందంటే ఉన్ని దుస్తులను కచ్చితంగా వినియోగించాల్సిందే. ముఖ్యంగా నేను ఎండ బాగా కాసిన తర్వాతే ఇంటి ఉంచి బయటకు వస్తుంటా. అది కూడా స్వెట్టర్, నెత్తికి టోపీ తప్పనిసరి. ప్రస్తుతం ప్లాట్ ఫాంపై తక్కువ ధరలకు ఉన్ని దుస్తులు దొరుకుతుండడంతో ఇబ్బంది లేకుండా పోయింది.

**- రాఘవయ్య, ఉడతావారిపాలెం, చిల్లకూరు**

### మంచు నుంచి తప్పించుకోవాలి



చలికాలంలో ఎక్కువగా మంచుకురుస్తుంది. చల్లటి గాలులు వీస్తుంటాయి. వాటి నుంచి రక్షణ పొందేలా ఉన్ని దుస్తులు వినియోగించాలి. నెత్తికి టోపీ కాని, మఫ్లర్ కాని కట్టుకోవాలి. అలాగే శరీరంలో ఉష్ణోగ్రతలు తగ్గకుండా చూడాలి. లేకుంటే చర్మ వ్యాధులతో పాటు శరీర రుగ్మతలు ఎక్కువ అయ్యే ఆస్కారం ఉంది.

**- కలపాటి శేఖర్, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు, మోమిడి**

## క్లుప్తంగా

### పాఠశాలకు ల్యాప్ టాప్ వితరణ



చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరు పంచాయతీ కొమరావారిపాళెం ప్రాథమికోన్నత పాఠశాలకు శుక్రవారం అన్నాడిశెట్టి గోపాల్‌శెట్టి జ్ఞాపకార్థం గ్రామ సర్పంచ్ అన్నాడిశెట్టి నాగమ్మ, ఆమె కుమారుడు మల్లికార్జున్ ల్యాప్‌టాప్, ప్రింటర్ వితరణ చేశారు. వారు మాట్లాడుతూ పాఠశాలకు ప్రింటర్, ల్యాప్‌టాప్ కావాలని ఉపాధ్యాయులు తమను సంప్రదించారని తెలిపారు. అలాగే గ్రామంలోని 90 మంది వృద్ధులకు కంటి అద్దాలు అందజేస్తున్నామని, కంటి ఆపరేషన్లు అవసరమైన 11 మందిని చెన్నైలోని శంకర నేత్రాలయకు తీసుకెళ్లి కంటి ఆపరేషన్లు చేయించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గుడి ముత్యాలయ్య, రంగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### లింగ వివక్షను వ్యతిరేకించాలి



ర్యాలీ చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

దక్కిలి : లింగ వివక్షను వ్యతిరేకించాలని ఐకేపీ ఏపీఎం జమునారాణి తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఉత్తర్వుల మేరకు ఈ నెల 25 నుంచి డిసెంబర్ 23 వరకు లింగ వివక్ష వ్యతిరేకం కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో మహిళా సంఘాల సభ్యులు, ఉద్యోగులు శుక్రవారం దక్కిలిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ఏపీఎం మాట్లాడుతూ చిన్న పిల్లలపై లైంగిక వేధింపులు, పిల్లలకు నిరంత విద్య, డ్రాప్ అవుట్స్, బాల్య వివాహాల నియంత్రణ తదితర అంశాలపై వివరించారు. ఆడ, మగా తేడా లేకుండా అందరినీ సమానంగా చూస్తామని ప్రతిజ్ఞ చేశారు. వెలుగు సీసీలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు వైద్య పరీక్షలు



వాకాడు : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్నట్టు పీహెచ్‌సీ వైద్యురాలు దీప్తి తెలిపారు. వాకాడులోని ఎన్‌బీకేఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు కడుక్కోవాలన్నారు. అనంతరం పిల్లల ఎత్తు, బరువు, రక్త నమూనాలను సేకరించారు. కంటి పరీక్షలు చేశారు. హెచ్‌ఎం ప్రవీణ్ కుమార్, సీహెచ్‌వో సలోమీ, హెచ్‌వీ సరోజని తదితరులు పాల్గొన్నారు.


### ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

గూడూరు రూరల్ : ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శివప్రసాద్ పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజంతోనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం విద్యార్థినులకు పోటీలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి విజయమహేష్, రెడ్ రిబన్ కో ఆర్డినేటర్ పీరా కుమార్, అధ్యాపకులు శ్రీధర్‌శర్మ, కిరణ్మయి, నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

### హెల్త్ అసిస్టెంట్ మృతి



బల్లి ప్రభాకర్ (ఫైల్)

నాయుడుపేట టౌన్ : మండలంలోని గొట్టిప్రోలు పీహెచ్‌సీలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ బల్లి ప్రభాకర్(51) శుక్రవారం మృతి చెందారు. ఆయన నాయుడుపేటలో నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం ఉన్నట్టుండి అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. కుటుంబ సభ్యులు వెంటనే వైద్యశాలకు తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు అతను గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రభాకర్ మృతి విషయం తెలుసుకున్న నాయుడుపేట, సూళ్లూరుపేట, ఓజిలి, పెళ్లకూరు, దొరవారిసత్రం, చిట్టమూరు మండలాలకు చెందిన వైద్యులు, సిబ్బంది ప్రగాఢ సంతాపం తెలిపారు. బల్లి ప్రభాకర్ మృతదేహన్ని వారి స్వగ్రామమైన ఓజిలికి తీసుకెళ్లారు.

### ఎరువుల దుకాణాల్లో తనిఖీ

కోట : కోటలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం ఏడీఏ నాగార్జున తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలను పరిశీలించారు. రెండు దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్‌లో తేడా ఉన్నట్లు గుర్తించారు. 45.8 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలను నిలుపుదల చేయించారు. ఎమ్మార్పీకే ఎరువులను విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. దుకాణం వద్ద స్టాక్, రేట్ల వివరాలు తెలుపుతూ బోర్డులు పెట్టాలని సూచించారు. ఏవో నిరంజన్‌కుమార్ పాల్గొన్నారు.

## వాణిజ్య పన్నులపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ అరుణకుమారి

గూడూరు రూరల్ : వ్యాపారులు వాణిజ్య పన్నుల్లో వచ్చే మార్పులపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగి ఉండాలని వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ అరుణకుమారి తెలిపారు. గూడూరులోని ఒక ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జీఎస్టీ వచ్చిన తర్వాత నిరంతం ట్యాక్స్‌లకు సంబంధించి పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. జీఎస్టీ కలిగిన ప్రతి వ్యాపారీ తమ ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని సూచించారు. వ్యాపార సంస్థలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. అద్దె దుకాణాల్లో ఉన్న వ్యాపారులు అద్దె అగ్రిమెంటు రెన్యువల్ రిటర్న్స్ వేయాలని కోరారు. డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ప్రమీల, వ్యాపారుల యూనియన్ నాయకులు సోమిశెట్టి చెంచురామయ్య, చంద్రశేఖర్, కోట సునీల్ కుమార్, సుధాకర్, భాస్కర్‌ప్రసాద్, కోట రామారావు, రామ్‌ప్రసాద్, ఎస్‌ఎల్‌ఎన్ బాబు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీల్లో షార్ విద్యార్థి ప్రతిభ



బ్రాంజ్ పతకం కైవసం చేసుకున్న విద్యార్థి

సూళ్లూరుపేట రూరల్ : గ్రాప్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఆఫ్ జమ్మూలో ఈ నెల 24 నుంచి 26 వరకు జరిగిన జాతీయ ఛాంపియన్ షిప్ పోటీల్లో షార్ అంతరిక్ష కేంద్రీయ పాఠశాల విద్యార్థి ప్రతిభ చూపినట్టు హెచ్‌ఎం రామకృష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం విద్యార్థిని అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీలకు 22 రాష్ట్రాల నుంచి 450 మంది విద్యార్థులు పాల్గొన్నా రని తెలిపారు. అండర్ 15 కేటగిరిలో తమ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న శ్రీనివాస్ పాల్గొని బ్రాంజ్ పతకం సాధించారని తెలిపారు. విద్యార్థికి షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి, ఉప ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసగాంధీ, సీమ, సుమిత్‌కుమార్ అభినందనలు తెలిజేశారు.

## బాల్య వివాహాలు వద్దు



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, కార్యకర్తలు

నాయుడుపేట టౌన్ : బాల్య వివాహాలు నేరమని, బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌గా చేద్దామని ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ కార్యాకర్తలు ప్రతిజ్ఞ చేశారు. ఐసీడీఎస్ అధికారులు శుక్రవారం నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సీడీపీవో ఉమామమేశ్వరి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. అనంతతరం సీడీపీవోతోపాటు సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు.

## పైపులైన్ లీకేజీతో కలుషితమవుతున్న తాగునీరు



పైపులైన్ లీకేజీతో రోడ్డుపై నిలిచిన నీరు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి నీటిని సరఫరా చేసే పైపులైన్‌కు క్రాస్ రోడ్డు సమీపంలో లీకేజీ ఏర్పడింది. దీంతో నీరు కలుషితమవుతోందని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో నిత్యం వాహనాలు ఎక్కువగా తిరుగుతుంటాయని, రోడ్డుపై నీరు నిలుస్తుండడంతో బురదమయమవుతోందని వాపోతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిరోజూ ఇదే రోడ్డులో వెళుతుంటారని, పైపులైన్ లీకేజీ గురించి పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీరు తాగడంతో వ్యాధుల బారిన పడాల్సి వస్తుందని ఆరోపిస్తునారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్ లీకేజీని అరికట్టాలని కోరుతున్నారు.

## శివయ్యకు అన్నాభిషేకం



కోట : సోమేశ్వరునికి అన్నాభిషేకం

చిల్లకూరు/కోట/సూళ్లూరుపేట రూరల్/నాయుడుపేట టౌన్ : చిల్లకూరు మండలం బల్లవోలు, తూర్పుకనుపూరులోని సోమేశ్వరస్వామి, మల్లికార్జున స్వామి ఆలయాల్లో శుక్రవారం కార్తీక మాస శివ రాత్రి సందర్భంగా విశేష పూజలు చేశారు. బిల్వార్చన, అన్నాభిషేకం చేశారు. చందన అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఆకాశ దీపోత్సవం, పల్లకి సేవ నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తగా దువ్వూరు కిరణ్‌కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. కార్యక్రమంలో సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, యరటపల్లి జానకిరామిరెడ్డి, శ్యామలమ్మ, ఈవో నవీన్‌కుమార్ రెడ్డి, మారంరెడ్డి అమరనాథ్ రెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ కోట తూర్పువీధిలోని సోమేశ్వరాలయంలో అన్నాభిషేకం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్తీక శిఖరదీప దర్శనం, పల్లకి ఉత్సవం చేపట్టారు. ఉపసర్పంచ్ గాది భాస్కర్ పాల్గొన్నారు.

■ సూళ్లూరుపేటలోని గంగా పార్వతి సమేత త్రినేత్ర నాగేశ్వరస్వామికి శుక్రవారం కార్తీక మాసం సందర్భంగా అన్నాభిషేకాన్ని చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమానికి కర్లపుడి సురేష్ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం ఆలయ మాజీ చైర్మన్ చెన్నారెడ్డి సుబ్రమణ్యం రెడ్డి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

నాయుడుపేట మండలంలోని టీటీడీ అనుబంధ గంగా కామాక్షి సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సహస్త్ర బిల్వార్చన, సహస్త్ర జ్యోతిర్లింగార్చన పూజలను అర్చకులు చదలవాడ గణేష్ శర్మ చేపట్టారు. అనంతరం వన భోజనాలు నిర్వహించారు.

## నేడు సామాజిక పింఛన్ల పంపిణీ

చిల్లకూరు : సామాజిక పింఛన్లను శనివారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో గోపి తెలిపారు. డిసెంబర్ 1 ఆదివారం కావడంతో ప్రభుత్వం ఒక రోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశించిందని తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది లబ్ధిదారులకు శనివారం వేకువజాము నుంచే నగదు పంపిణీ చేయాలని తెలిపారు.

## అనాథ పిల్లలకు చేయూత

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని పిచ్చిరెడ్డితోపు వీధిలో ఉన్న అనాథాశ్రమంలోని పిల్లలకు శుక్రవారం తుమ్మూరుకు చెందిన మురళీ నిత్యావసర సరుకులు, బియ్యం బస్తా, కూరగాయలు అందజేశారు. బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఆశ్రమానికి ప్రతి నెలా బియ్యం బస్తా అందజేస్తామన్నారు. మురళీని నిర్వాహకుడు తొప్పని కృష్ణయ్యకు అభినందించారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

వాకాడు : రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని వెంకటగిరి ఏడీఏ నాగార్జునసాగర్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల రైతులు దిగుబడి పెంచుకునేందుకు రైతు డిపోల యజమానుల వద్ద మందులు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఎక్కువ మంది నకిలీలను రైతులకు అంటగడుతున్నారని తెలిపారు. తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారిణి ఆర్నూరు దీప, గ్రామ వ్యవసాయ సహాయకులు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో కూతురిని పట్టించుకోని తండ్రి



ఐసీడీఎస్ అధికారుల సంరక్షణలో ఉన్న చిన్నారి

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద గురువారం రాత్రి ఒక వ్యక్తి పూటుగా మద్యం సేవించి మత్తులో పడిపోయాడు. అతని కుమార్తె (8) బిక్కుబిక్కుమంటూ అక్కడే ఉండిపోయింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ వ్యక్తిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. విచారణలో అతను విన్నమాలకు చెందిన రవిగా తేలింది. భార్య వదిలి వెళ్లడంతో కుమార్తె తండ్రి వద్దే ఉన్నట్లు తెలుసుకున్నారు. తండ్రి మద్యం మత్తులో ఉండగా నిస్సహాయ స్థితిలో ఉన్న చిన్నారి చూసి సీఐ బాబి చలించారు. ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరికి సమాచారం అందించారు. ఆమె సూపర్‌వైజర్ మణెమ్మను అక్కడికి పంపించారు. చిన్నారిని రాత్రి పట్టణంలోని అంగన్‌వాడీ కార్యకర్త శాంతి ఇంటిలో ఉంచి శుక్రవారం ఉదయం సీఐ బాబి చొరవతో గూడూరులోని బాల సదన్‌లో చేర్పించారు. బాలిక అక్కడే ఉండి చదువుకుంటుందని, అప్పుడప్పుడు చూసి వెళ్లాలని తండ్రి రవికి సూచించారు.

## కండలేరులో 52.895 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 52.895 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 4,400 క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,600, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 150, మొదటి బ్రాంచ్ కాలువకు 35 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

### కాకాణితో నేదురుమల్లి భేటీ



వెంకటగిరి(సైదాపురం) : మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డిని శుక్రవారం నెల్లూరు డైకస్ రోడ్డులో ఉన్న ఆయన నివాసంలో వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించుకున్నారు.

### చలిగాలులతో ఉక్కిరిబిక్కిరి

పెళ్లకూరు : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల ఆకాశం మేఘావృతమైంది. తీవ్ర చలి గాలులు వీయడంతో మూడు రోజుల నుంచి పలు ప్రాంతాల్లోని ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తుపాను ప్రభావంతో వర్షాలు కురిసి లోతట్టు వ్యవసాయ భూముల్లో నీరు వచ్చే అవకాశం ఉండడంతో రైతులు వరినాట్లు పూర్తిగా ఆపేశారు. తేలికపాటి వర్షాలకు గ్రామీణ రోడ్లు, వీధులు బురదమయంగా మారడంతో వాహనచోదకులు, గ్రామీణ ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.

### తల్లిదండ్రుల సమావేశాన్ని విజయవంతం చేయాలి

దక్కిలి: పాఠశాలల్లో డిసెంబర్ 7న నిర్వహించనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో టి.గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం దక్కిలి మండలంలోని 71 ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ డిసెంబర్ 7వ తేదీన ఆయా పాఠశాలల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లితండ్రులతో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు, తాడు లాగడం తదితర పోటీలు నిర్వహించాలన్నారు. విద్యార్థులు చదువులు, మధ్యాహ్న భోజనంపై అవగాహన కల్పించాలని తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈవో-2 పి.జగదీష్‌బాబు, కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగరాజ పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి



ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నామని డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని తిరుపతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ ఆరు మాసాల కూటమి పాలనలో తీవ్రమైన ప్రజా వ్యతిరేకత నెలకొన్నట్లు చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడి శస్త్ర చికిత్స చేసుకుని విశ్రాంతి తీసుకుంటున్న నెలబల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అట్ల గోపాల్, టింకాయతోపు గ్రామానికి చెందిన రమణారెడ్డిని సత్యనారాయణరెడ్డి పరామర్శించారు. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి, పాపాడి ప్రతాప్‌రెడ్డి, అట్ల కృష్ణయ్య పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులను అడ్డుకుంటాం

**- ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్**



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

కోట : కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తున్నారని, వాటిని అడ్డుకుంటామని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. ఆయన శుక్రవారం కోట మండలం గోవిందపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ ఉప్పల ప్రసాద్‌గౌడ్‌ను పరామర్శించారు. ఉపాధి హామీ పనుల్లో జరిగిన అక్రమాలను ప్రశ్నించిన ప్రసాద్‌గౌడ్‌పై ఏపీవో పూర్ణిమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మేరిగ మురళీధర్ మాట్లాడుతూ అక్రమ అరెస్టులకు భయపడేది లేదన్నారు. ప్రశ్నిస్తున్న నాయకులను అణచివేసేందుకు అధికారులు, పోలీసులను పావుగా వాడుకుంటున్నారని తెలిపారు. గూడూరు నియోజకవర్గంలో ఐదు నెలల్లో ఏడు హత్యలు జరిగాయన్నారు. బాధ్యత గల ప్రజాప్రతినిధి రౌడీయిజాన్ని, రౌడీ షీటర్లను పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ లేవన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల జోలికొస్తే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో కోట, చిట్టమూరు మండలాల కన్వీనర్లు పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రాధాక్రిష్టారెడ్డి, సర్పంచ్ తిరుపాలయ్య, రాజారెడ్డి, వెంకురెడ్డి పాల్గొన్నారు.

## నాకు తెలియకుండా నిధులు ఇవ్వొద్దు



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, అధికారులు

- ఎమ్మెల్యే రామకృష్ణ ఆదేశం
- వాడివేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- చైర్మన్ కౌన్సిలర్ల ఆగ్రహం

వెంకటగిరి రూరల్ : 'నాకు తెలియకుండా నిధులు విడుదల చేయడానికి వీలులేదు'అని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధికారులను ఆదేశించారు. వెంకటగిరి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశం వాడివేడిగా సాగింది. ఇందులో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రామకృష్ణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డు పరిధిలో రాబడి రూ.6 కోట్లు ఉంటే ఖర్చు మాత్రం రూ.7 కోట్లు అవుతోందన్నారు. గత కమిషనర్ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, కొత్త కమిషనర్‌ను నియమించి పట్టణ అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది రెండు నెలల్లో గుంతలు లేని మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. అనుమతులు లేకుండా కట్టడాలు నిర్మించే వారికి నోటీసులు ఇవ్వకుండానే నిర్మాణాలను కూల్చివేయాలని ఆదేశించారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం**

పట్టణంలోని దత్తాత్రేయ ఆశ్రమం ఎదురుగా రూ.3 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని 4వ వార్డు కౌన్సిలర్ ఎంఏ నారాయణ ఆరోపించారు. 7వ వార్డు కౌన్సిలర్ చంద్రశేఖర్‌రెడ్డి, 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న లేఅవుట్‌లో 8.50 ఎకరాలు, ఇందిరమ్మకాలనీలో ఎకరా, ఎన్‌జీవో కాలనీలో ఎకరా, ఎన్టీఆర్ కానీలో 4 ఎకరాల ప్రభుత్వ భూములు అక్రమణకు గురవుతున్నాయన్నారు. 21వ వార్డు కౌన్సిలర్ జి.ఢిల్లీబాబు మాట్లాడుతూ కౌన్సిలర్లతో సంప్రదించకుండా ఇష్టం వచ్చినట్టు అంశాలను నమోదు చేసుకోవడం సమంజసం కాదన్నారు. వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో వార్డుల్లో అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రతిసారీ శానిటేషన్‌కు రూ.5 లక్షలు కేటాయిస్తున్నా పనులు మాత్రం చేయడం లేదని దుయ్యబట్టారు. తాము చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయాలని పలుమార్లు చైర్మన్‌ను కోరినా ఫలితం లేదని, గతంలో ఎమ్మెల్యే ఆదేశిలిచ్చినా పట్టించుకోకపోవడం దారుణమని నిలదీశారు. ఈ క్రమంలో మున్సిపల్ విప్ పి లక్ష్మి, బాలయ్య మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జోక్యం చేసుకుని సర్దుబాటు చేశారు.